## క్లుప్తంగా

### సౌత్ సెంట్రల్ జోనల్ కమిటీ రైల్వే బోర్డు మెంబర్‌గా మద్దాళి



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణానికి చెందిన మద్దాళి సుబ్బయ్యను సౌత్ సెంట్రల్ జోనల్ కమిటీ రైల్వే బోర్డు మెంబర్‌గా నిమితులయ్యారు. ఈయన నిమాయమాకానికి కృషి చేసిన ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయులు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తిలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రైల్వే ప్రయాణికుల సమస్యలపై రైల్వే అధికారుల దృష్టికి తీసుకుని వెళ్తానని ఆయన తెలియజేశారు.

### దాచేపల్లిలో స్థల వివాదం



దాచేపల్లి : పులిచింతల ప్రాజెక్ట్ ముంపు గ్రామమైన ఏలియంపేట గ్రామస్తులకు ప్రభుత్వం కేటాయించిన స్థలంపై శుక్రవారం వివాదం జరిగింది. దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని ముత్యాలంపాడు రోడ్డులో ముంపు బాధితులకు కేటాయించిన స్థలంలో కొంత మంది వ్యక్తులు విగ్రహాన్ని పెట్టి, కాషాయం జెండాలు పాతడం వివాదంకు దారి తీసింది. దీంతో ముంపు బాధితులు, విగ్రహం పెట్టిన వ్యక్తులు పాటాపోటీగా స్థలం వద్ద ఆందోళనకు దిగారు. ముంపు బాధితులు మాట్లాడుతూ.. దాచేపల్లిలోని 1095/3ఎ3 సర్వేనెంబర్ దేవాదాయశాఖకు చెందిన 1.67 ఎకరాల భూమిని రూ.5,49 లక్షలకు ప్రభుత్వం కొనుగోలు చేసి తమకు కేటాయించిందని, ముంపులో ఇళ్లు, పొలాలు కోల్పోయిన అరుగురికి ఇంటి స్థలాలు కూడా ఇచ్చారని చెప్పారు. ఇళ్ల స్థలాలు, కమ్యూనిటీ హాలు కోసం కేటాయిస్తే కొంతమంది వ్యక్తులు తమను ఆ స్థలంలోకి వెళ్లకుండా భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. తమకు న్యాయం జరిగేంత వరకు కదిలేదని భీష్మించి కుర్చుకున్నారు. ఆందోళనకారులకు సీఐ బిలాలుద్దీన్ నచ్చజెపి తహసీల్దార్ తానంగి ప్రవీణ్‌కుమార్ వద్దకు తీసుకెళ్లారు. ఆందోళనకారులతో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని చెప్పారు.

### అ'పూర్వ' కలయిక



విజయపురిసౌత్: సుమారు 30 ఏళ్ళ క్రితం ఆడిపాడారు. ఆ తరువాత విడిపోయారు. సుదీర్ఘ జీవన ప్రయాణంలో విభిన్నదారుల్లో సాగి వివిధ వృత్తులు, ఉద్యోగాలు, వ్యాపారాల్లో రాణించారు. జీవితం యాంత్రికమైపోయింది. మనసులో ఏదో తెలియని వెలితి అందరిని పట్టి పీడించింది. మూలమేదో గుర్తించారు. ఒక్కసారి చిన్ననాటిస్నేహితులను కలుసుకోగలిగితే చాలు అనుకున్నారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న సుమారు 40 మంది చిరునామాలను సేకరించారు. 1993–94 బ్యాచ్‌లో 10వ తరగతి ఆర్‌సీఎం ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసం పూర్తి చేసి ఉపాధ్యాయ వృత్తి, ఇంజినీర్లగా, వ్యాపారస్తులుగా వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు శుక్రవారం మరోసారి అదే పాఠశాలలో తిరిగి కలుసుకుని ఒకే వేదికపై చేరుకున్నారు. ఒక్కసారిగా అందరిలో ఉద్వేగం .. అపురూపమైన ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేస్తూ ఆటపాటలతో, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి సరదాగా గడిపారు. పరస్పర పలకరింపులు, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఫోన్ నెంబర్లు, చిరునామాలు సేకరించుకున్నారు. తమ ఉన్నతికి దోహదపడిన ఆనాటి గురువులను గుర్తు చేసుకున్నారు. అపురూపమైన జ్ఞాపకాలను తమ స్నేహబంధానికి గుర్తుగా గ్రూఫ్ ఫోటోలు దిగారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి, ఆర్గనైజర్ చిరుగూరి బాలకొండయ్య, పూర్వ విద్యార్థులు కోట్ల కోటేశ్వరావు, ఫణికుమార్, కోట్ల కృష్ణ, ఇస్మాయిల్, పల్లపు వెంకటేశ్వర్లు, బాడిశ శ్రీనివాసరావు, పి శ్రీనివాసరావు, రత్నం, పి రాజశేఖర్, అరుణకుమారి, రాజమణి, కోటేశ్వరి, రాణి, విజయలక్ష్మి, భూలక్ష్మి, సైదులు, పద్మ, అప్పలరాజు పాల్గొన్నారు.

### వాసవి క్లబ్ ఆధ్వర్యంలో చలివేంద్రం



మాచర్ల: పట్టణంలో మండుటెండలకు ప్రజలు సేదతీరేందుకు ఆర్అండ్‌బి బంగ్లా ఎదురు మంచినీటి చలివేంద్రాన్ని వాసవి క్లబ్ సభ్యులు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ సభ్యులు మాట్లాడుతూ అనేక రకాలుగా ప్రజా సేవలందిస్తున్నట్లు వాసవి క్లబ్ అన్నారు. ఎండాకాలంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన గౌరవాధ్యక్షులు తిరివీధి వెంకట నాగేశ్వరరావు, అధ్యక్షులు ఓరుగంటి చెన్నకేశవరావు ప్రారంభించడం ఎంతో అభినందనీయం అన్నారు. వాసవి క్లబ్ మహిళా లక్ష్మీ చెన్నకేశవ క్లబ్ అధ్యక్షుడు మేడా వెంకటలక్ష్మి, ప్రధాన కార్యదర్శి నేరేళ్ళ సుభాషిణి, జోన్ చైర్మన్ మేడం నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పందిరి నరసింహరావు, కోశాధికారి కొప్పురావూరి నీరజ పాల్గొని మంచినీరు అందించారు.

# ప్రజా సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం

**ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి**



లబ్ధిదారులకు కరపత్రాన్ని అందజేస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

మాచర్ల: రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ కుటుంబాలతో పాటు అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి మేలు చేయడమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని, అందులో భాగంగానే నవరత్నాల ద్వారా పలు సంక్షేమ పథకాలను నేరుగా పేద కుటుంబాలకు అందిస్తూ వారిని ఆర్థికంగా బలోపేతం చేస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని 23వ వార్డులోని సచివాలయ పరిధిలో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కామనబోయిన కోటయ్య, వార్డు కౌన్సిలర్ మురళి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పీఆర్కే మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి మేలు చేయడమే లక్ష్యంగా సీఎం జగన్మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. దీనిని తట్టుకోలేక ప్రతి పక్షం కుట్ర చేస్తూ సీఎం జగన్‌ను విమర్శించటమే పనిగా పెట్టుకున్నారని పీఆర్కే అన్నారు. మీకు మేలు జరగాలంటే పేద ప్రజల కోసం పనిచేస్తున్న సీఎం జగన్‌కు జే జేలు పలకాలన్నారు. 23వ వార్డులోన 276 కుటుంబాలు సందర్శించి వివిధ పథకాల ద్వారా గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన వివరించారు. ప్రతి కుటుంబానికి కరపత్రాలను అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్‌లు తురక కిషోర్, బత్తుల ఏడుకొండలు, అబ్దుల్ జలీల్, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కామనబోయిన కోటయ్య, గ్రీనరీ అండ్ బ్యూటీషియన్ రాష్ట్ర డైరెక్టర్ ఉప్పలపాటి జాని, కౌన్సిలర్లు మురళీ, పోలా శ్రీను, చంద్ర కుమార్, మాచర్ల చిన ఏసోబు, బిసి నాయకులు కామనబోయిన నాగరాజు, వీర్ల లింగయ్య, గంగబోయిన శ్రీను, కామనబోయిన చంద్రశేఖర్ శ్రీను, వీర్లబోయిన కృష్ణ, కామనబోయిన రమణయ్య, మున్నా శివకృష్ణ, మంజుల సత్యనారాయణ, షేక్ మస్తాన్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

## చర్చి నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ రామకృష్ణారెడ్డి

కారెంపూడి: మండలంలోని చింతపల్లి గ్రామంలో నిర్మించ తలపెట్టిన చర్చి నిర్మాణానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. చర్చి నిర్మాణానికి రూ. 10 లక్షలు మంజూరు చేసిన ప్రభుత్వ విప్ రామకృష్ణారెడ్డిని సంఘస్తులు, పాస్టర్ జోసెఫ్‌కుమార్ ఘనంగా సన్మానించారు. పేద వర్గాలను ఆదరిస్తూ ప్రజలందరి బాగు కోసం నిరంతరం శ్రమిస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రజలకు మరింతగా సేవలందించే శక్తిసామర్థ్యాలను దేవుడు ప్రసాదించాలని సంఘస్తులు ప్రార్థన చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పంగులూరి రామకృష్ణయ్య, సర్పంచ్ ఉన్నం రామాంజమ్మ, ఉన్నం శ్రీనివాసరావు, ఎంపీటీసీ అచ్యుతరావు, అలుగునూరి అమరయ్య, సూరె చెంచారావు, లంకా నాగేశ్వరరావు, మోషెయ్య,తదితర గ్రామ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ప్రభుత్వ విప్ పీఆర్కేతో పాటు జెడ్పీటీసీ షేక్ షఫీ, మండల పార్టీ అధ్యక్షుడు కొంగర సుబ్రమణ్యం, కారెంపూడి పట్టణ పార్టీ అధ్యక్షుడు బొమ్మిన అల్లయ్య, చింతల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ పాపకుమారి

దాచేపల్లి : రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఏఓ డి. పాపకుమారి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఏఓ పాపకుమారి మాట్లాడుతూ...రైతులు నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి ఇబ్బందులు పడవద్దని, కొనుగోలు చేసిన విత్తనాలకు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలని చెప్పారు. ప్రభుత్వం గుర్తింపుపొందిన దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించాలని, పంట మార్పిడి విధానం అమలు చేయాలని ఆమె తెలిపారు. ఆర్బీకేల్లో పచ్చిరొట్టె ఎరువులను వారం రోజుల్లో అందుబాటులో ఉంచుతామన్నారు. సబ్సిడీపై డ్రిప్‌లు పొందాలని ఉద్యానవన శాఖ అధికారి మోహన్ చెప్పారు. ఈ సమావేశంలో సలహా మండలి కన్వీనర్ షేక్ జాకీర్‌హుస్సేన్, వైస్ ఎంపీపీ కందుల జాను, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ మంచినీరు

**ఎంపీడీఓ రాజగోపాల్**



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సురేష్

మాచవరం: జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా మండలంలోని ప్రతి ఇంటికీ కుళాయి ఏర్పాటు చేసి మంచినీరు అందించేందుకు పనులు వేగవంతంగా జరుగుతున్నట్లు ఎంపీడీఓ వై.రాజగోపాల్ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా పలు ప్రభుత్వ శాఖల పనితీరును ఆయా శాఖల అధికారులు వివరించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సురేష్ మాట్లాడుతూ మండల ప్రజల దాహార్తి తీర్చేందుకు జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా పనులు చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే తురకపాలెం గ్రామంలో పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. గ్రామస్తుల వాటాగా 10 శాతం ఫండ్‌ను చెల్లించి రాష్ట్రంలోనే మొదటి గ్రామంగా నిలవడం అభినందనీయమన్నారు. చెన్నాయపాలెం, మోర్జంపాడు గ్రామాల్లో పనులు చేస్తున్నట్లు చెప్పారు. వేసవి దృష్ట్యా పలు చోట్ల బోర్‌వెల్స్ ఏర్పాటు చేశామన్నారు. ఉద్యానశాఖ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈఏడాది మిరప సాగు చేసే రైతులు ఆర్బీకే ద్వారా విత్తనాలు ఆన్‌లైన్లో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. రెవెన్యూ శాఖ తరుపున డిప్యూటీ తహసీల్దారు హాజరై, రెవెన్యూ శాఖ పనితీరు వివరిస్తుండగా పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇప్పటికి నాలుగు సార్లు మండల పరిషత్ సమావేశాలు జరిగినా తహసీల్దారు ప్రసాద్ ఒక్క సమావేశానికి కూడా హాజరు కాకపోవడం, రెవెన్యూలో ఆన్‌లైన్, అడంగళ్, డీఎస్ పెండింగ్, అనేక భూ సమస్యలు తిష్ట వేసినా తహసీల్దారు స్పందించడం లేదని, మండల రెవెన్యూ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లచ్చిరెడ్డి, వైస్ ఎంపీపీ చల్లగుండ్ల లక్ష్మయ్య, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ వంకాయల రమేష్, మండల ప్రత్యేక అధికారి శ్రీకృష్ణదేవరాయలు,ఎంపీటీసీలు, సర్పంచులు, పలు ప్రభుత్వ శాఖల అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

### నేడు జాతీయ లోక్ అదాలత్

పిడుగురాళ్ల: జాతీయ లోక్ అదాలత్‌ను శనివారం నిర్వహించడం జరుగుతుందని గురజాల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కమ్ చైర్‌పర్సన్ , మండల న్యాయ సేవాధికార సంస్థ న్యాయమూర్తి షరిమ్మల తెలియజేశారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, మనోవర్తి, చెక్ బౌన్స్ కేసులు, సివిల్ కేసులు, ప్రీలిటిగేషన్ కేసులు పరిష్కరించుకోవల్సిందిగా కక్షిదారులను కోరారు. అలాగే దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీ చేసుకుని గ్రామాల్లో తగాదాలు లేకుండా శాంతియుత సమాజం, వివాదరహిత గ్రామాల ఏర్పాటుకు ప్రజలు తమ సహాయ, సహకారాలు అందించాల్సిదిగా ఆయన కోరారు.

### డ్రిప్, స్ప్రింకర్లకు దరఖాస్తు చేసుకోవాలి

రెంటచింతల: రాష్ట్ర ప్రభుత్వం 2023–2024 సంవత్సరానికి సంబంధించి రైతులకు రాయితీపై డ్రిప్, స్ప్రింకర్లు అందిస్తున్నట్లు కావాల్సిన రైతులు తమ పరిధిలోని రైతుభరోసా కేంద్రాల్లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి కోరారు. శుక్రవారం మల్లవరం, జెట్టిపాలెం రైతుభరోసా కేంద్రాల్లో రైతులతో నిర్వహించిన సమావేశాలలో ఆయన మాట్లాడారు. 5 ఎకరాల్లోపు పొలం ఉన్న రైతులకు 90 శాతం రాయితీ, 10 శాతం నాన్ సబ్సిడీ నగదు రైతు కట్టుకోవాలన్నారు. 5 ఎకరాల కన్నా ఎక్కువ ఉన్న రైతులకు 50 శాతం సబ్సిడీ, 50 శాతం నాన్ సబ్సిడీ నగదును రైతు కట్టుకోవాలని సూచించారు. స్ప్రింకర్ల పైపులకు సంబంధించి 5 ఎకరాల్లోపు ఉన్న రైతులకు 55 శాతం, 5 ఎకరాల కన్నా ఎక్కువ ఉన్న రైతులకు 45 శాతం సబ్సిడీ ఉంటుందన్నారు. రైతు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌బుక్, వన్ బి, ఎఫ్.ఎం.బి( పీల్డ్ మ్యాప్), బ్యాంక్ బుక్ జిరాక్స్(నకళ్ళు) ద్వారా దరఖాస్తు పెట్టుకోవడానికి కావాల్సిన పత్రాలు ఇవ్వాలని తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో యువతి మృతి

దాచేపల్లి : రోడ్డు ప్రమాదంలో యువతి మృతిచెందిన ఘటన శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. దాచేపల్లి సమీపంలోని అద్దంకి-నార్కెట్‌పల్లి హైవేపై ఉన్న భవ్య పెట్రోల్ బంకు సమీపంలో జరిగిన ఈఘటనలో దాచేపల్లికి చెందిన వేముల వెంకటనారాయణ కుమార్తె రోజా(27) మృతిచెందింది. క్రోసూరులోని బంధువుల ఇళ్లలో జరిగిన శుభ కార్యంలో మృతురాలు రోజాతో పాటుగా కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తున్న క్రమంలో పెట్రోలు బంకు సమీపంలో అదుపుతప్పి వాహనం కిందపడింది. ఈ ఘటనలో రోజాకు బలమైన గాయాలు కావడంతో మృతిచెందింది. ద్విచక్రవాహనం నడుపుతున్న దేవళ్ల వెంకటేశ్వర్లు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతురాలు రోజా అవివాహితురాలు.

# సమస్యల పరిష్కారానికే గ్రామోదయం

**గురజాల ఆర్‌డీఓ అద్దెయ్య**



వృద్ధురాలిని పరిశీలిస్తున్న ఆర్‌డీఓ అద్దెయ్య



దుర్గాభవానీ కాలనీ వాసులతో మాట్లాడుతున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

పిడుగురాళ్లరూరల్: గ్రామోదయం కార్యక్రమం సమస్యల పరిష్కారానికి ఒక మార్గమని ఆర్‌డీఓ అద్దెయ్య అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లె గ్రామంలో పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశాలతో తహసీల్దార్ చక్రవర్తి ఆధ్వర్యంలో గ్రామోదయం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధికారులు, గ్రామ, సచివాలయ అధికారులు పాల్గొన్నారు. అధికారులతో కలిసి సచివాలయం దగ్గర నుంచి గ్రామంలో పర్యటించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీలు తిరిగారు. దీనిలో భాగంగా గర్భిణులు, బాలింతలను వారి సమస్యలను తెలుసుకుని వారికి అవసరమయ్యే మందులను అందజేశారు. పారిశుధ్య సమస్యలు, డ్రై నేజీ సమస్యలు గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్, సచివాలయం, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ సెంటర్లను సందర్శించారు. గ్రామ పారిశుధ్య కార్మికులతో మట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం వారితో కలిసి అల్పాహారం చేశారు. కార్యక్రమంలో, కరాలపాడు ప్రాథమిక వైద్యులు నాగిరెడ్డి, సర్వశిక్ష అభియాన్ ఏఈ సురేష్‌నాయక్, ఈవీఆర్‌డీ శంకర్‌రావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అంజలి, ఏపీఎం సీహెచ్ జయరాం, పంచాయితీ సెక్రటరీ కోటేశ్వరరావు, ఏఈలు సోమయ్య, సత్యనారాయణ, సురేశ్ నాయక్, సచివాలయ సిబ్బంది , అంగన్‌వాడీ కార్యకర్తలు, వలంటీర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దాచేపల్లి : సంక్షేమ ఫలాల ద్వారా సామాజిక అభివృద్ధిని సాధించాలని నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ సాంబయ్య అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని దుర్గాభవానీ కాలనీలో శుక్రవారం గ్రామోదయం కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలనీవాసులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాలనీలో సిమెంట్ రోడ్లు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని, ఇంటింటికి తాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటామని చైర్మన్ హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిరుపేదల అభివృద్ధి కోసం సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని, ఈ పథకాల ద్వారా నిరుపేదలు లబ్ధిపొంది అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలని చైర్మన్ సుబ్బమ్మ సాంబయ్య చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో నిరుపేద విద్యార్థులు చదువుకునేందుకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పించిందని, పిల్లలను పనికి పంపించకుండా బడికి పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య, కౌన్సిలర్లు మందపాటి వీరారెడ్డి, ఈదా వెంకటరెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్త మాతంగి సుధారాణి, ఎఎన్ఎం తదితరులున్నారు.

మాచర్ల రూరల్: గ్రామీణ ప్రాంతంలోని ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని వెంటనే పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన గ్రామోదయం, గ్రామ నడకను ప్రజలు సద్వినియోగపర్చుకోవాలని ఎంపీడీఓ కోటేశ్వరరావు కోరారు. శుక్రవారం మండలంలోని లింగాపురం, భైరవునిపాడు గ్రామాల్లో గ్రామోదయం, గ్రామ నడక కార్యక్రమాలలో పాల్గొని మాట్లాడారు. గ్రామంలో పారిశుధ్య పనులను పర్యవేక్షించి వర్మికంపోస్టు యార్డుల పనితీరుపై పలు సూచనలు, సలహాలందించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. అనంతరం స్థానికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారం చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ షేక్ బాషా, ఎంఈఓ వేముల నాగయ్య, ఎఈ బాబునాయక్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జ్యోతి, గ్రామ సర్పంచ్ శ్రీనివాసరావు, పందరబోయిన వెంకట్రావమ్మ, కార్యదర్శులు కోటేశ్వరరావు తదితరులున్నారు.

# మాట ఇచ్చాం.. చేసి చూపించాం

**ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి**



లబ్ధిదారులకు కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చిన ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 18 వార్డులో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ జోగిపర్తి సుజాత, ముక్కంటి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించారు. వ్యాపార సముదాయంలోని యజమానులకు ప్రభుత్వం ఇప్పటి వరకు అందించిన ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తూ ఎమ్మెల్యే కార్యక్రమాన్ని ముందుకు నడిపించారు. వార్డులోని ప్రజలు ఆరోగ్య శ్రీ ద్వారా ఆపరేషన్లు చేయించుకున్న వారు రాజన్న బిడ్డ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఆరోగ్య శ్రీ ద్వారా ఉచితంగా ఆపరేషన్లు చేయించుకున్నామని, మరికొందరు మా పిల్లల చదువుకు వసతి దీవెన, విద్యా దీవెన, అమ్మ ఒడి పథకాల లబ్ధిపొందిన మహిళలు ఎమ్మెల్యేతో ఆనందాన్ని వ్యక్తం చేశారు. ప్రతి గడపకు ఎమ్మెల్యే హాజరై నవరత్నాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న లబ్ధిని వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసుమహేష్‌రెడ్డి మాట్లాడుతూ శుద్ధి చేసిన కృష్ణా నీటిని ప్రతి ఇంటికి కుళాయిని ఏర్పాటు చేయడంతో మహిళలందరు తమ ఇంటి లోపలే నేడు మంచినీటిని పట్టుకుంటున్నారని తెలిపారు. టీడీపీ హయంలో వాగ్దానాలు తప్పా పనులు మాత్రం చేపట్టకపోవడంతో నేడు టీడీపీ నాయకులు గ్రామాల్లో, వీధుల్లో తిరిగే పరిస్థితిలో లేదన్నారు. ప్రజలే టీడీపీ నాయకులపై మండిపడుతున్నారని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి తెలియజేశారు. పేద ప్రజల ఆరోగ్యం కోసం పట్టణ ఆరోగ్య కేంద్రాలను పట్టణంలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అలాగే ఈ కార్యక్రమంలో స్థానిక సమస్యలపై పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకుని రావడంతో తక్షణమే మున్సిపల్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేసి స్థానిక సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎ. వెంకటేశ్వర్లు, పట్టణ కన్వీనర్ చింతా వెంకట రామారావు, వైస్ చైర్మన్‌లు షేక్ జైలాబ్దిన్, కొమ్ము ముక్కంటి, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండీ గఫార్, కౌన్సిలర్లు జోగిపర్తి సుజాత, ముక్కంటి, పసుపులేటి ఆనంద్‌బాబు, షేక్ సైదావలి, ఎస్కే సైదావలి, మాదాల కిరణ్‌కుమార్, అజ్మీర శారద, కొక్కెర శ్రీను, కుక్కమూడి సుందరరావు, పట్టణ యూత్ కన్వీనర్ మందా సుధీర్, మార్కెట్‌యార్డు డైరెక్టర్ జాషువా, నాయకులు గొట్టిముక్కల పవన్‌రెడ్డి, కొడూరి ప్రసాద్, ఆతుకూరి శ్రీధర్, వైఎస్సార్ నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

## వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం



ప్రత్యేక అలంకారంలో పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి



స్వామి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు

రెంటచింతల: స్థానిక సుబ్బన్నతోట కాలనీలో వేంచేసిన శ్రీ అలివేలు మంగా పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం స్వామివారి జన్మ నక్షత్రమైన శ్రావణా నక్షత్రం సందర్భంగా స్వామివార్లకు ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు ఓరుగంటి మారుతీశర్మ నేతృత్వంలో స్వామివారికి ఉదయం 5.30 నుంచి ప్రత్యేకపూజలు నిర్వహించారు. వేదపండితులు జిగురు చంద్రశేఖర్ శర్మ ఆధ్వర్యంలో స్వామివార్లకు పంచామృతాభిషేకాలు, సుదర్శన హోమం నిర్వహించారు. ఉదయం 9 గంటలకు భక్తులు మల్లెల అర్చన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. దేవస్థానం అధ్యక్షుడు నాళం పెదబాబు, పాలకవర్గ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మాచర్ల: పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌లో వేంచేసియున్న వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులు, భక్తుల ఆధ్వర్యంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. స్వామి వారి జన్మనక్షత్రమైన శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయంలో స్వామి వారి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హోమం నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వీరాంజనేయరెడ్డి, చుండూరు మల్లిఖార్జునరావు, అర్చకులు, భక్తులు పలువురు పాల్గొన్నారు.

గురజాల : మండల పరిధిలోని గంగవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీదేవి భూదేవి సమతే శ్రీ వెంకటేశ్వరస్వామి వారి 6వ వార్షిక కల్యాణ మహోత్సవ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి పంచామృత అభిషేకం, పూజా కార్యక్రమాలు , పాలు, నెయ్యి, పంచదార, కొబ్బరినీళ్లతో ప్రత్యేక అభిషేకాలు, మధ్యాహ్న సమయంలో ప్రత్యేకంగా అలంకరించిన మండపంపై ఉత్సవ విగ్రహాలను ఉంచి కల్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కల్యాణ మహోత్సవంలో దంపతులు పీటలపై కూర్చొని కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం సమయంలో స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా వాహనంపై ఉంచి గ్రామ పురవీదుల్లో ఊరేగించారు.

### నేడు శివాలయం వార్షికోత్సవం

దుర్గి: మండల పరిధిలోని కంచరగుంట గ్రామంలో ప్రసిద్దిగాంచిన శ్రీ అన్నపూర్ణాదేవి సమేత శ్రీ విశ్వేశ్వర స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం శనివారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఉదయం 4గం''లకు గణపతి పూజతో వేడుకలు ప్రారంభించనున్నారు. అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, ఎదురుకోల, 10గం''ల శాంతి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు రావిపాటి హరినాథ్ శర్మ, సహాయ అర్చకులు బాలాజి తెలిపారు. అనంతరం మధ్యాహ్నం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

## ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి



ఉపాధి హామీ పనులనుపై మాట్లడుతున్న ఏపీఓ రాజు

పిడుగురాళ్లరూరల్: గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి హామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ రాజు అన్నారు. మండలంలోని జూలకల్లు, కమేపల్లి గ్రామాల్లో మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం జరుగుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం పనులను ఉదయానే చేపట్టాలని ఆయన అన్నారు. వడదెబ్బకు గురికాకుండా కాపాడుకోవాలన్నారు. గ్రామాల్లో అర్హత కలిగిన కూలీలకు ఉపాధి హామీ పనులు కల్పించాలని తెలిపారు. ప్రతి ఒక్కరు ఆధార్‌కార్డును బ్యాంక్ ఖాతకు అనుసంధానం చేయాలని తెలిపారు. ఎండలు పెరిగిపోవడంతో కూలీలు ఉదయం సమయంలోనే పనులను పూర్తి చేసుకుని ఇంటికి చేరుకోవాలన్నారు. పని ప్రదేశాల్లో తాగునీరు తప్పనిసరిగా తీసుకుని వెళ్లాలని తెలియజేశారు. వేసవి దృష్ట్యా పని జరిగే ప్రదేశాల్లో తగిన వసతులు కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. ఈ రోజు మండలంలో 4800 మందికి పైగా ఉపాధి హామీ పనులకు హాజరయ్యారని, సోమవారం నాటికి పనులకు 6 వేల మంది హాజరు అయ్యేలా ఫీల్డ్ అసిస్టెంట్లు చూడాలని ఆయన తెలిపారు. అనంతరం కూలీల హాజరును పరిశీలించారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ రమణ, సునిత పాల్గొన్నారు.

## నాణ్యమైన మిర్చినారు రైతులకు అందించాలి

**జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయిమార్కొండారెడ్డి**

రెంటచింతల: ప్రభుత్వ గుర్తింపు పొందిన కంపెనీలకు చెందిన విత్తనాలతో సస్యరక్షణ చర్యలు చేపట్టిన నాణ్యమైన మిర్చినారును మాత్రమే నర్సరీ నిర్వాహకులు రైతులకు అందించాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయిమార్కొండారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక కానుకమాత చర్చి ఆవరణలోని కల్యాణమండపంలో నిర్వహించిన జిల్లా నర్సరీల సంఘం సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా ఉండేందుకు ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి మేలురకాలైన విత్తనాలను, ఎరువులను, రాయితీలపై వ్యవసాయ పనిముట్లను అందజేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. నర్సరీలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతను ఇచ్చి ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. నర్సరీ నిర్వాహకులు సేవాదృక్పథంతో రైతులకు నాణ్యమైన విత్తనాలతో పెంచిన మేలు రకమైన నారును అందించాలని కోరారు.